ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం


కాలనీ ప్రతినిధులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి

చంపాపేట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్‌లోని యాదగిరినగర్ కాలనీలో వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనున్నదని కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి అన్నారు. డివిజన్‌లోని యాదగిరినగర్ కాలనీలో రూ.2కోట్ల వ్యయంతో చేపట్టిన స్ట్రామ్ వాటర్ డ్రైన్స్(వరదనీటి కాలువ)నిర్మాణ పనులను గురువారం కార్పొరేటర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌నాయుడు, జనార్దన్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సుమిత్‌సింగ్, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సలీంనగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం


సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మీరెడ్డి

చాదర్‌ఘాట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ముసారాంబాగ్ డివిజన్‌లోని సలీంనగర్‌లో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీ నుంచి మంజూరైన రూ.16లక్షల నిధులతో నూతన సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మలపల్లి రమేష్‌రెడ్డి, ముసారాంబాగ్ డివిజన్ అధ్యక్షుడు కొప్పుల దినేష్‌కుమార్ పటేల్, మాజీ అధ్యక్షుడు యాదగిరి సురేందర్, నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్ సుజాతానాయక్

హస్తినాపురంలో అభివృద్ధి పనులకు రూ.1.80కోట్లు

చంపాపేట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని వివిధ కాలనీలలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.1.80కోట్లు మంజూరయ్యాయని జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సుజాతానాయక్ తెలిపారు. ఈ మేరకు గురువారం జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో నిర్వహించిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో తీర్మానించినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లోని అనుపమానగర్ కాలనీ, సరస్వతీనగర్‌కాలనీ, హస్తినాపురం నార్త్ ఎక్స్‌టెన్షన్ కాలనీలలో సీసీ రోడ్డు, ప్రహరీ, ఇతర నిర్మాణ పనులకు ఈ నిధులు వినియోగించనున్నట్లు తెలిపారు.

అబ్దుల్లాపూర్‌మెట్ పీఎస్‌లో రాజమౌళిపై ఫిర్యాదు

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): హనుమంతునిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన డైరెక్టర్ రాజమౌళిపై చర్యలు తీసుకోవాలని గురువారం అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్‌లో యుగ తులసి పార్టీ అధ్యక్షుడు, టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు కె.శివకుమార్ ఫిర్యాదు చేశారు. ఇటీవల రామోజీ ఫిల్మ్ సిటీలో జరిగిన వారణాసి సినిమా టైటిల్ రిలీజ్ ఈవెంట్‌లో డైరెక్టర్ రాజమౌళి హిందూ మతంపై వ్యతిరేకత నింపి, వైశ్యామ్యాలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేసినందుకు గాను తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో ఆయన పేర్కొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన నూతన న్యాయమూర్తులు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కోర్టులలో నియమితులైన న్యాయమూర్తులు ఆశాలత, జయరామిరెడ్డి, కవిత, కిరణ్‌కుమార్, శ్రీనివాస్, శ్రీదేవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్ వారిని అభినందించి కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. బాధ్యతలు స్వీకరించిన న్యాయమూర్తులను బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

రాజేంద్రనగర్ కోర్టు స్టాండింగ్ కౌన్సిల్‌గా వెంకటరమణారెడ్డి

రంగారెడ్డి జిల్లా కోర్టులు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ కోర్టు స్టాండింగ్ కౌన్సిల్‌గా వెంకటరమణారెడ్డి నియమితులయ్యారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. మూడు సంవత్సరాల పాటు ఆయన స్టాండ్ కౌన్సిల్‌గా విధులు నిర్వర్తించనున్నారు.

పేదల ఆరోగ్యానికి భరోసా సీఎం సహాయ నిధి


సందీప్‌కుమార్‌కు చెక్కు అందజేస్తున్న పారిజాతారెడ్డి

సరూర్‌నగర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకునే అనేక మంది పేదల ఆరోగ్యానికి సీఎం సహాయనిధి భరోసా కల్పిస్తుందని బడంగ్‌పేట్ మాజీ మేయర్, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి అన్నారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని బాలాపూర్‌కు చెందిన పి.సందీప్‌కుమార్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా రూ.50,500 మంజూరయ్యాయి. దీనికి సంబంధించిన చెక్కును గురువారం పారిజాతారెడ్డి ఆయనకు అందజేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్నాల రాజేందర్‌రెడ్డి, బడంగ్‌పేట్ కౌన్సిల్ కాంగ్రెస్ మాజీ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

చాదర్‌ఘాట్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ హైదరాబాద్-1 డిపో నుంచి నడిచే అన్ని రకాల ఏసీ గరుడ, నాన్ ఏసీ సూపర్‌లగ్జరీ, డీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సులలో ప్రయాణించే వారికి మరింత మెరుగైన సౌకర్యాలను కల్పించేందుకు అవసరమైన సలహాలు, సూచనలు, ఫిర్యాదులను స్వీకరించేందుకు శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ వేణుగోపాల్ తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9959226248 ద్వారా సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

● అభినందనలు



జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలను విజయవంతంగా నిర్వహించిన జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్, అదనపు కమిషనర్ (ఎన్నికలు) హేమంత కేశవ్ పాటిల్‌లను గురువారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలుపుతున్న జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి

- ఎల్బీనగర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి)

● జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేతో మధుసూదన్‌రెడ్డి



జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన నవీన్‌యాదవ్‌ను గురువారం గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పండ్లబుట్టను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అంజయ్య, గణేష్‌నాయక్, రఘుపతిరెడ్డి, వెంకటేశర్లుగుప్తా, నవరాజ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

- అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి)

ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ..

బస్టాపుల్లో షెల్టర్లు లేక ప్రయాణికుల అవస్థలు.. చోద్యం చూస్తున్న జీహెచ్‌ఎంసీ, ఆర్టీసీ అధికారులు



చంపాపేట చౌరస్తాలోని సాగర్ ప్రధాన రహదారిపై బస్‌షెల్టర్ లేవపోవడంతో ఎండలో నిల్చున్న ప్రయాణికులు

చంపాపేట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ప్రయాణికులకు సేవలు అతంత మాత్రంగానే అందుతున్నాయి. బస్టాపుల్లో షెల్టర్లు లేక ప్రయాణికులు ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ.. అవస్థలు పడుతున్నారు. చంపాపేట, హస్తినాపురం డివిజన్‌లతో పాటు కంచన్‌బాగ్ ఏరియాలోని పలు రహదారులపై బస్‌షెల్టర్లు లేక పోవడంతో ప్రయాణికులు ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ ఆర్టీసీ బస్సుల రాక కోసం ఎదురుచూస్తున్నారు.

బస్‌షెల్టర్లకు నోచుకోని..

ఇటు ఐఎస్‌సదన్ సంతోష్‌నగర్ నుంచి చంపాపేట, హస్తినాపురం డివిజన్‌ల మీదుగా ఇబ్రహీంపట్నం, యాచారం, దేవరకొండ, నాగార్జునసాగర్ వైపు వెళ్లేందుకు సాగర్ ప్రధాన రహదారిపై జిల్లా బస్సులతో పాటు సిటీబస్సులు వందల సంఖ్యలు తిరుగుతుంటాయి. చంపాపేట, కర్మన్‌ఘాట్, బైరామల్‌గూడ, సాగర్‌రింగ్‌రోడ్, హస్తినాపురం చౌరస్తా, బీఎన్‌రెడ్డినగర్ చౌరస్తా వరకు వన్‌సైడ్ బస్టాపులు మాత్రమే దర్శనమిస్తాయి. మరోవైపు సాగర్‌రింగ్‌రోడ్ నుంచి ఏయిర్‌పోర్టు వెళ్లే ఇన్నర్ రింగ్‌రోడ్‌లో మందమల్లమ్మ చౌరస్తా, చంపాపేట ఎక్స్‌రోడ్, ఒవైసీ ఆస్పత్రి, ఫిసల్‌బండ బస్టాప్‌లలో ఒకవైపు మాత్రమే బస్‌షెల్టర్లు ఉండటంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు.

బస్‌షెల్టర్ల నిర్మాణ బాధ్యత ఎవరిది?

ప్రధాన రహదారులపై ఉన్న బస్టాప్‌ల వద్ద బస్‌షెల్టర్లు నిర్మించే బాధ్యత జీహెచ్‌ఎంసీపై ఉంది. బస్‌షెల్టర్లు అవసరం ఉన్న చోట్ల జీహెచ్‌ఎంసీ, ఆర్టీసీ, ట్రాఫిక్ అధికారులు క్షేత్ర పరిశీలన చేసి ఉన్నతధికారులకు ప్రతిపాదనలు పంపాలి. కానీ, ప్రజా ప్రతినిధులు, ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు వెళ్లినపుడు తూతూ మంత్రంగా బస్‌షెల్టర్లు నిర్మించే పరిసరాలను ఆయా శాఖల అధికారులు పరిశీలించి మమా అనిపిస్తున్నారు. ఆచరణలో మాత్రం బస్‌షెల్టర్ల నిర్మాణం కార్యరూపం దాల్చక పోవడంతో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

మిధాని ఆర్టీసీ బస్సులు తిరుగుచున్న ప్రాంతాలలో బస్‌షెల్టర్ల నిర్మాణం కోసం స్థానిక జీహెచ్‌ఎంసీ, మున్సిపాలిటీ, ట్రాఫిక్ అధికారులతో క్షేత్రస్థాయి పరిశీలన జరిపి పై అధికారులకు ప్రతిపాదనలు పంపించాం. చంపాపేట చౌరస్తా, మందమల్లమ్మ చౌరస్తా, నాదర్‌గుల్ ప్రాంతాలలో బస్‌షెల్టర్ల నిర్మాణాలు చేపట్టవలసి ఉంది. ఏడాది కిందట పలు ప్రాంతాలలో సర్వే చేశాం.

- విజయ్‌కుమార్, డీఎం, మిధాని ఆర్టీసీ బస్‌డిపో, కంచన్‌బాగ్

బస్‌షెల్టర్లు లేక ఇబ్బందులు



చంపాపేట చౌరస్తాలో నిత్యం వందల మంది ప్రయాణికులు బస్సుల కోసం ఎదురు చూస్తుంటారు. బస్‌షెల్టర్ లేక పోవడంతో వర్షంలో, ఎండకు ఇబ్బందులు పడుతున్నాం. ప్రయాణికులకు సదుపాయాలు కల్పించే బాధ్యత ఆర్టీసీపై ఉంది.

- చంద్రశేఖర్, రెడ్డికాలనీ, ప్రయాణికుడు

తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు

● ఎమ్మెల్యే సబితారెడ్డి


తాగునీటి సమస్యపై అధికారులతో చర్చిస్తున్న సబితారెడ్డి

సరూర్‌నగర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మహేశ్వరం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ప్రజలు తాగునీటి సరఫరా సమృద్ధిగా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సదరు ఇబ్బందులు దూరం చేసేలా అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పి.సబితారెడ్డి వాటర్ బోర్డు అధికారులకు సూచించారు. నియోజకవర్గంలోని తుక్కుగూడ, జల్‌పల్లి మునిసిపాలిటీల పరిధిలోని తాగునీటి సమస్యపై గురువారం ఆమె జిల్లెలగూడలోని క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ ఆయా మునిసిపాలిటీల్లో ఎక్కడెక్కడ సరఫరా సమృద్ధిగా జరగడం లేదో క్షేత్ర పర్యటన ద్వారా తెలుసుకుని పరిష్కార చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో జల్‌పల్లి, తుక్కుగూడ మునిసిపాలిటీల పరిధిలో అదనపు పైపులైన్లు ఏర్పాటు చేయించామని, సదరు లైన్ల ద్వారా ప్రజలకు నీటి సరఫరా చేపట్టాలని ఆమె సూచించారు. ఎస్‌టీపీల నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలని అధికారులకు సబితారెడ్డి సూచించారు. ఈ సమావేశంలో మెట్రో వాటర్ బోర్డు డైరెక్టర్లు సుదర్శన్, సుజాత, సీజీఎం వినోద్‌కుమార్, డీజీఎం నిసార్ అహ్మద్, అధికారులు పాల్గొన్నారు.

సామాజిక తెలంగాణకు కట్టుబడి ఉన్నాం : చౌదరి జయంత్ సింగ్


సమావేశంలో మాట్లాడుతున్న చౌదరి జయంత్ సింగ్, చిత్రంలో ఆర్.కృష్ణయ్య, కపిలవాయి దిలీప్‌కుమార్


ఎల్బీనగర్/మన్సూరాబాద్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మొదటి నుంచే సామాజిక తెలంగాణకు కట్టుబడి ఉన్న పార్టీ రాష్ట్రీయ లోక్‌దళ్(ఆర్‌ఎల్‌డీ) అని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి చౌదరి జయంత్ సింగ్ పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్రీయ లోక్‌దళ్ పార్టీ ఆధ్వర్యంలో 'సామాజిక చైతన్య రథ యాత్ర' రెండోదశను గురువారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమం ఆర్‌డీఎల్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో ఆర్కేపురంలోని ఆర్‌డీఎల్ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా చౌదరి జయంత్ సింగ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం జనాభాకు అనుగుణంగా బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని, ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆర్‌ఎల్‌డీ పార్టీ అభ్యర్థులను నిలబెడతామని, ఆర్‌ఎల్‌డీ పార్టీని తెలంగాణ ప్రజలు ఆశీర్వదించాలని ఆయన కోరారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ బీసీలకు న్యాయబద్ధంగా రావాల్సిన 42శాతం రిజర్వేషన్లను కల్పించే వరకు పోరాడతామని, ఇందుకు ఆర్‌ఎల్‌డీ పార్టీ మద్దతుగా రావడం సంతోషకరమని అన్నారు. ఆర్‌ఎల్‌డీ జాతీయ మహిళా అధ్యక్షురాలు కపిలవాయి ఇందిరా మాట్లాడుతూ తమ పార్టీ బీసీలకు అధిక సీట్లు కేటాయిస్తుందని తెలిపారు. ఆర్‌ఎల్‌డీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కపిలవాయి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీల్లో చైతన్యం పెంపొందించేందుకు తమ పార్టీ ఆధ్వర్యంలో సామాజిక చైతన్య రథయాత్ర చేపడుతున్నామని, ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు చేయడంలో విఫలమైన విషయమై ఈ యాత్ర ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడు వీజీఆర్ నారగోని, ఆర్‌ఎల్‌డీ తెలంగాణ రాష్ట్ర నాయకులు పాండురంగారెడ్డి, కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి, సుధాకర్, ఎంఎస్ బేగ్, బీరప్ప, రిషబ్, విశాల్, మల్లేష్, నరసింహారావు, సతీష్, జానీ, రాంప్రసాద్, కళాకారులు బుల్లెట్ వెంకన్న, సిద్దం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న కార్పొరేటర్


సమావేశంలో మాట్లాడుతున్న రఘువీర్‌రెడ్డి

మన్సూరాబాద్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వసూళ్లకు పాల్పడుతూ అక్రమ కట్టడాలను స్థానిక కార్పొరేటర్ ప్రోత్సహిస్తున్నారని బీఆర్‌ఎస్ పార్టీ మన్సూరాబాద్ యువ నాయకుడు జక్కిడి రఘువీర్‌రెడ్డి ఆరోపించారు. గురువారం మన్సూరాబాద్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్రమ కట్టడాలను సీజ్ చేసేందుకు వచ్చిన టౌన్‌ప్లానింగ్ అధికారులను స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అడ్డుకున్నారని ఆరోపించారు. డివిజన్‌లో చాలా చోట్ల ఎన్నో అక్రమ నిర్మాణాలు కార్పొరేటర్ కనుసన్నల్లోనే జరుగుతున్నాయని, వీటి వల్ల ప్రభుత్వ ఆదాయానికి పెద్ద ఎత్తున గండి పడుతున్నా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని ఆయన ప్రశ్నించారు. శ్రీరామ్‌నగర్‌కాలనీ సాయిబాబా ఆలయానికి సమీపంలోని ఓ షెడ్డులో లక్షల రూపాయలు తీసుకుని వైన్స్ ఏర్పాటుకు స్థానిక ప్రజాప్రతినిధి పూనుకున్నాడని, విషయం తెలిసి తాము సోషల్ మీడియాలో ప్రచారం చేస్తే రాత్రికి రాత్రే శానిటరీ దుకాణం అంటూ కొందరు కాలనీవాసులను పట్టుకుని మరో కొత్త నాటకానికి తెరలేపారని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు నర్రి వెంకన్న కురుమ, బాలరాజుగౌడ్, లింగం, శంకర్, అరుణ్, అఖిల్ తదితరులు ఉన్నారు.

అవినీతి, అక్రమాలపై పంచాయితీ సిగ్గుచేటు


సమావేశంలో మాట్లాడుతున్న బీమిడి రామకృష్ణారెడ్డి

మన్సూరాబాద్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్‌లో అవినీతి, అక్రమాలంటూ బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల నాయకులు ఒకరిపై ఒకరు సోషల్ మీడియాలో ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని, దీనిని డివిజన్ ప్రజలు అసహ్యించుకుంటున్నారని యూత్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు భీమిడి రామకృష్ణారెడ్డి అన్నారు. మన్సూరాబాద్‌లోని ఎంఈ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్రమ నిర్మాణాలను అడ్డుకుని ప్రభుత్వ ఆదాయాన్ని పెంచాల్సిన స్థానిక కార్పొరేటరే వాటికి వత్తాసు పలకడం ఏమిటని ప్రశ్నించారు. డివిజన్‌లో జరుగుతున్న అక్రమ నిర్మాణాల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ ఖజానాకు గండిపడకుండా కాంగ్రెస్ పార్టీ ద్వారా తాము చూసుకుంటామని అన్నారు. ఈ సమావేశంలో యూత్ కాంగ్రెస్ నాయకులు నరేష్‌యాదవ్, పి.రాజేందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, చందు రెడ్డి, కార్తీక్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలి

● ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలక్రిష్ణారెడ్డి


ఎంపవరింగ్ యూత్ సావనీర్‌ను విడుదల చేస్తున్న అతిథులు

సరూర్‌నగర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రోజురోజుకూ మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా కొత్త కొత్త పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయని, వాటిలోని సాంకేతికతను అందుకునే స్థాయిలో ఇంజినీరింగ్ విద్యార్థులు ఎప్పటికప్పుడు తమ నైపుణ్యాభివృద్ధిని పెంపొందించుకోవాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలక్రిష్ణారెడ్డి సూచించారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్‌లో గల ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో ఫ్యూయెల్(ఫ్రెండ్స్ యూనియన్ ఫర్ ఇంజనీరింగ్ లైఫ్), నగరంలోని సీజీఐ ఐటీ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎంపవరింగ్ యూత్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో వృత్తి సాంకేతికత, నైపుణ్యాభివృద్ధి పెంపుదలకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మాతృశ్రీ విద్యా సంస్థల గౌరవాధ్యక్షుడు డాక్టర్ పీవీఆర్ కశ్యప్, డాక్టర్ ఎం.కామేశ్వరరావు, ఫ్యూయెల్ వైస్ ప్రెసిడెంట్ కె.సర్వేశ్, సీజీఐ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జ్యోతిశైలేంద్ర, ప్రోగ్రామ్ అసోసియేట్ డాక్టర్ నందితారాజ్, ప్లేస్‌మెంట్ అండ్ కెరీర్ గైడెన్స్ సెల్ బృందం, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్ ఎదుట ట్రాన్స్‌జెండర్ల బైండోవర్

ఎల్బీనగర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): దిల్‌సుఖ్‌నగర్ మెట్రో స్టేషన్ వద్ద రోడ్లపై రాత్రి సమయాల్లో అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడుతున్న ఇద్దరు ట్రాన్స్‌జెండర్లను చైతన్యపురి పోలీసులు అదుపులోకి తీసుకుని సరూర్‌నగర్ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం... నందనవనంకు చెందిన రత్నావత్ హయాతి అలియాస్ సురేష్, గూగులోత్ చిన్నిశ్రీ అలియాస్ కుమార్ చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలోని దిల్‌సుఖ్‌నగర్ మెట్రో స్టేషన్ వద్ద రోడ్లపై రాత్రి సమయాలలో అసాంఘీక కార్యకలాపాలు నిర్వహిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి సరూర్‌నగర్ తహసీల్దార్ వేణుగోపాల్ ఎదుట హాజరుపరిచి బైండోవర్ చేశారు.

55 మంది మద్యంప్రియులకు కౌన్సెలింగ్

కొత్తపేట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రాచకొండ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 55 మందికి వారి కుటుంబ సభ్యుల సమక్షంలో గురువారం కౌన్సెలింగ్ నిర్వహించినట్లు టీటీఐ ఇన్‌స్పెక్టర్ అర్జున్ రాచపుడి తెలిపారు. కౌన్సెలింగ్‌లో భాగంగా సందేశాత్మక గీతాలు, మద్యంమత్తులో వాహనాలు నడపడంతో జరిగిన పలు ప్రమాదాల వీడియో క్లిప్పులను, ప్రముఖుల సందేశాలనూ ప్రదర్శించారు.

పోలీసులు వృత్తి నైపుణ్యాలను పెంచుకోవాలి

సైదాబాద్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పోలీసులు ఎప్పటికప్పుడూ వృత్తి నైపుణ్యాలను పెంచుకోవాలని సైదాబాద్ ఏసీపీ సోము వెంకట్‌రెడ్డి సూచించారు. సైదాబాద్ డివిజన్ పరిధిలోని 45 మంది పోలీస్ సిబ్బందికి సైదాబాద్ పోలీస్‌స్టేషన్ హాల్‌లో వార్షిక శిక్షణ నిర్వహించారు. నేరాలు జరుగుతున్న తీరు, నేర నివారణ, సాక్ష్యాల సేకరణ, నేరగాళ్లకు శిక్ష ఖరారయ్యేలా పోలీసులు ఎప్పటికప్పుడు అధునిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ఈ శిక్షణలో ఆర్థిక క్రమశిక్షణపై రిటైర్డ్ ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్, ఆరోగ్య అవగాహనపై డాక్టర్ జి.శృతితో తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ బి.చంద్రమోహన్, డీఐ ఎల్. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల మన్ననలు అందుకోవాలి

చాదర్‌ఘాట్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విధి నిర్వాహణలో కాలానుగుణంగా పోలీసు సిబ్బంది తమ నైపుణ్యాన్ని పెంపొందించుకుని అన్ని వర్గాల ప్రజల మన్ననలను అందుకోవాలని మలక్‌పేట ఏసీపీ సుబ్బిరామిరెడ్డి తెలిపారు. ముసారాంబాగ్‌లోని అరోరా పీజీ కళాశాల ఆవరణలో ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్న మలక్‌పేట డివిజన్ వార్షిక శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ శిక్షణ కార్యక్రమం వచ్చే ఆదివారం వరకు కొనసాగుతుందని తెలిపారు. డివిజన్ పరిధిలోని మలక్‌పేట, చాదర్‌ఘాట్, డబీర్‌పుర పోలీస్‌స్టేషన్లలో పనిచేసే దాదాపు 250 మంది సిబ్బందిలో రోజుకు 50 మంది వార్షిక శిక్షణ కార్యక్రమంలో పాల్గొంటున్నారని తెలిపారు. హోం గార్డు నుంచి ఇన్‌స్పెక్టర్ స్థాయి వరకు పనిచేస్తున్న వారందరు ఈ శిక్షణలో విధి నిర్వాహణలో ఎదురైన, ఎదుర్కొన్న కష్టాలు వాటిని అధిగమించడానికి సాంకేతికతను ఉపయోగించి నేరస్థులను పట్టుకోవడంలో చూపిన చొరవపై తమ అనుభవాలను వివరిస్తున్నట్లు ఏసీపీ వివరించారు. ఈ కార్యక్రమంలో మలక్‌పేట, చాదర్‌ఘాట్, డబీర్‌పుర ఇన్‌స్పెక్టర్లు పి.నరేష్ కేబీ మురారీ, నాను నాయక్, ఎస్ఐలు అదనపు ఇన్‌స్పెక్టర్లు జయశంకర్, శ్రీనివాసరావు, ఉమాశంకర్, ఎస్ఐలు సంజీవరెడ్డి, తేజానాయక్, రాజశేఖర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ముగిసిన బాలల హక్కుల వారోత్సవాలు


బాలుడికి బహుమతి అందజేస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ

సైదాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కార్పొరేటర్ కొత్తకాపు అరుణారెడ్డి సూచించారు. సైదాబాద్‌లోని జువెనైల్ హోంలో బాలల దినోత్సవం సందర్భంగా ఈ నెల 14 నుంచి ప్రారంభమైన బాలల హక్కుల వారోత్సవాలు శనివారం ముగిశాయి. ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హోం సూపరిండెంట్ కృష్ణవేణి, హెచ్ఎం కళ్యాణి పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం


రిజ్వాన్

వనస్థలిపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యమయ్యారు. ప్రశాంత్‌నగర్‌లో మగ్గం వర్క్ చేసే యువకుడు, టీవీ కాలనీలో మతిస్థిమితం లేని వృద్ధురాలు అదృశ్యమయ్యారు. పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన రిజ్వాన్(30) వనస్థలిపురం ప్రశాంత్ నగర్‌లో మగ్గం వర్క్ చేస్తున్నాడు. ఈనెల 14న ఊరికి వెళ్తున్నానని షాపులో చెప్పి వెళ్లాడు. అప్పటి నుంచి తిరిగి రాకపోవడంతో సదరు షాప్ నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మతిస్థిమితం లేని వృద్ధురాలు..


మల్లమ్మ

వనస్థలిపురం టీవీ కాలనీలో తోటపల్లి లక్ష్మి తన అత్త తోటపల్లి మల్లమ్మ(70) కలిసి నివసిస్తున్నారు. గత కొంతకాలంగా మల్లమ్మకు మతిస్థిమితం సరిగా లేదు. దీంతో ఈనెల 19న లక్ష్మి పనిపై ఇంటినుంచి బయటకు వెళ్లింది. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు మల్లమ్మ ఇంట్లో నుంచి బయటకు వెళ్లింది. తిరిగి రాకపోవడంతో మల్లమ్మ కోడలు లక్ష్మి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

అప్పుల బాధ తాళలేక యువకుడి ఆత్మహత్య

వనస్థలిపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాహెబ్ నగర్‌కు చెందిన పారంద శ్రీకాంత్(32) హయత్‌నగర్‌కు చెందిన నలుగురు వ్యక్తుల వద్ద రూ. 2లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఈ క్రమంలో 'అప్పు ఇచ్చిన వారు డబ్బులు తిరిగి ఇవ్వమని, నీవు వివాహం ఎలా చేసుకుంటావో చూస్తాం' అని వేధించడంతో శ్రీకాంత్ తీవ్ర మనస్తాపం చెందాడు. గురువారం తన గదిలో సెల్ఫీ వీడియో తీసుకుని తాను చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు వాపోయాడు. తన చావుకు కారణం అయిన వారిని వదిలి పెట్టవద్దని, హరిహరపురం చెరువు కట్టపై పురుగుల మందు తాగి ఆత్మహత్యకి పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

● అన్నప్రసాదం వితరణ



చంపాపేటలోని నల్ల, ఎర్ర పోచమ్మ దేవాయం ఆవరణలో గురువారం అమావాస్యను పురస్కరించకొని 500 మంది పేదలకు అన్నప్రసాదంను అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ మాత అన్నపూర్ణేశ్వరి అన్నప్రసాద వితరణ కమిటి చైర్మన్ దండేటికార్ భగవాన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

- చంపాపేట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి)